

ప్రత్యక్ష నగదు బదిలీకి ఎన్‌పిసిఐ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన, పెట్టబోతున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీకి ఎన్‌పిసిఐ అనుసందానం తప్పనిసరిగా చేసుకోవాలని పీలేరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో నగదు బదిలీ పొందగోరే లబ్ధిదారులు తపాలా శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకుని ఎన్‌పిసిఐ లింక్ పొందాలని అన్నారు. పీలేరు డివిజన్ పరిధిలోని పీలేరు, కల్లూరు, భాకరాపేట, దామలచెరువు, మంగళంపేట, గ్యారంపల్లె, రొంపి చెర్ల, చిన్నగొట్టిగల్లు తపాలా కేంద్రాల్లో 25,802 మందికి ఐపిపిబి ఖాతాలు ఉన్నాయని, వీరిలో ఇప్పటివరకు 1600 మంది మాత్రమే ఎన్‌పిసిఐ అనుసంధానం చేయించు కున్నారని చెప్పారు. మిగిలిన వారు కూడా త్వరగా ఎన్‌పిసిఐ లింక్ పూర్తి చేసుకోవాలి తెలిపారు. తపాలా శాఖ కొత్తగా ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలు కూడా వినియోగంలోకి తీసుకువచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పిఎంలు గిరిబాబు, సుబ్రహ్మణ్యం, హరీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్ని కాపాడుకుందాం

- ఎల్ఐసి యూనియన్ సెంట్రల్ జోన్ కళాజాతా ముఖ్య నేతలు తిరుపతయ్య, సుజాత



రాయచోటిలో ప్రదర్శన నిర్వహిస్తున్నకళాకారులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడంలో గల ప్రాధాన్యతను కళాత్మకంగా ప్రజలకు చేరవేయడమే ఎల్ఐసి కళాజాతా లక్ష్యమని ఎల్ఐసి ఉద్యోగుల కళజాతా నేతలు, సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షులు సుజాత అన్నారు. పట్టణంలోని స్థానిక బంగ్లా సర్కిల్‌లోని కళాశాల మైదానంలో ఎల్ఐసి యూనియన్ కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వేలు, ఆయిల్ రంగాల్లో స్వంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని తెలిపారు. వాటిని బలహీనపరచడం దేశానికి మంచిది కాదని హితవు పలికారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, పోస్టల్ రంగాల విశ్వసనీయతకు నిదర్శనం అని అన్నారు. బిఎస్ఎన్ఎల్ ఇటీవల మళ్లీ పుంజుకోవడానికి, అలాగే ఇప్పటికీ జాతీయ బ్యాంకులకు, గ్రామీణ బ్యాంకులకు ప్రజల మద్దతు కొనసాగడానికి ఆ సంస్థల మంచి పనితీరు కారణమని అన్నారు. విద్యుత్, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ రంగంలోనే ఉండాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు. కళా జాతాలో భాగంగా ఎల్ఐసి యూనియన్ కళాకారులు నాటికలు ప్రదర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను పాటలు, నృత్యాల ద్వారా ప్రజలకు వివరించారు. దీనిపై స్థానిక ప్రజానీకం నుంచి వచ్చింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, ఎల్ఐసి యూనియన్ నేతలు వేణుగోపాల్ రాజు, ఆదినారాయణరెడ్డి, గిరిధర్ కళ్యాణ్, విశ్వనాథ్,శ్రీకృష్ణ దేవరాయలు, సువర్ణ జయరం, ఎ.వి. రమణ, శ్రీనివాసులురెడ్డి, రామాంజులు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్, కెవిపిఎస్ వెంకటయ్య, మున్సిపల్ సిబ్బంది రాంబాబు, చెన్నయ్య, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఖాజాబీ, విజయమ్మ అరుణ, సుమలత, శంకరమ్మ, కవిత, సుబ్బమ్మ, స్వప్న, కల్పలత, హమాలీ నాయకులు మాధవయ్య, మురళీ మోహన్ రాజు, వెంకట్రామిరెడ్డి, కృష్ణయ్య, రమణయ్య నాయుడు, చంద్ర, అనేక రంగాల ప్రముఖులు, 25 మంది కళాకారులతో పాటు హైదరాబాద్ యూనియన్ నేతలు గిరిధర్ మద్దిలేటి పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : ప్రభుత్వ సంస్థలను బలపరిస్తేనే ప్రజాధనాన్ని ప్రజా ప్రయోనాలకు ఉపయోగించుకునే వీలుంటుందని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, సిఐటియు సభ్యులు తెలిపారు. బెంగళూరులో జరగనున్న 13వ ఎల్ఐసి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు చేపట్టిన కళాజాత శుక్రవారం మదనపల్లెకు చేరుకుంది. 25 మంది సభ్యులున్న కళాజాత బృందాన్ని మదనపల్లె ఎల్ఐసి బ్రాంచ్ సెక్రటరీ రామమూర్తి, ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు హరీంద్రశర్మ, పి. శ్రీనివాసులు ఆహ్వానించారు. స్థానిక కదిరి రోడ్డులోని ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి కళాజాత బృందాలు ప్రభుత్వ సంస్థల బలోపేతంపై చేపట్టిన, నృత్యాలు, నాటకాలు, పాటలు ప్రజలను చైతన్యపరిచి ఎంతో ఆలోచింపచేశాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రాంచ్ కళాజాతా బృందం టీమ్ లీడర్ తిరుపతి, మదనపల్లె బ్రాంచ్ సెక్రటరీ రామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ బీమా రంగా సంస్థల్లో ఎల్ఐసికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిలో వాటాలను ఉప సంహరించుకోవాలనే ఆలోచన చేయడం దుర్మార్గ మన్నారు. ఎల్ఐసిని బలపరిస్తే ప్రజాధనం-ప్రజా ప్రయోజనం కోసం అనే పిలుపు సాకారమౌతుందన్నారు. కార్యక్రమంలో కళాజాతా బృంద నిర్వాహకులు సుజాత, మద్దిలేటి, గిరిధర్, మదనపల్లె ఎల్ఐసి బ్రాంచ్ సిబ్బంది, సిఐటియు నాయకులు హరీంద్రనాథ్ శర్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మదనపల్లెలో నినాదాలు చేస్తున్న కళాజాతా బృందం

వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట 'ఆశా'ల ధర్నా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆశా కార్యకర్తలతో సంబంధం లేని పనులు చేయించడమే కాకుండా, వారిపై వేధింపులకు పాల్పడుతున్న సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీలక్ష్మి, సిహెచ్ఒ అరుణ, సూపర్ వైజర్ సుమతిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యం. జయమ్మ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు సంబంధం లేని పనులు చేయించడం, వేధింపులకు పాల్పడటం లాంటి చర్యలకు నిరసనగా శుక్రవారం మదనపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటగ్లాడుతూ ఒపి డ్యూటీలు చేయిస్తూ వేధింపులకు పాల్పడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారులపై చర్యలు తీసుకోవాలని, పనిభారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆన్‌ప్లైన్ లేదా రికార్డు పనులు ఏదైనా ఒక్కసారి మాత్రమే చేయించాలని నినాదాలు చేశారు. అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. లెప్రసీ సర్వే పరితోషికం బకాయిలు చెల్లించాలని, హౌస్ హోల్డ్ సర్వేకు తగిన సరంజమా ఇవ్వాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు ధర్నాకు హాజరైతే మెమోలు ఇస్తామని అధికారులు బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు. 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని, సిబ్బంది. చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి, వేధించి ఆశాలతో చేయిస్తున్నారని అందులో భాగంగానే పిహెచ్‌సిలో ఓపి డ్యూటీలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వర్క్స్‌తో పాటు సొంత డబ్బులుతో 26 రకాల రికార్డ్స్ కొని రాయాలని హింసిస్తున్నారని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలలో రోజంతా కూర్చోబెట్టడం, రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని మిగిలిన సమయంలో ఫీల్డ్‌లోకి వెళ్లాలని ఎన్‌హెచ్ఎం నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తూ ఆశాలను తీవ్రమైన ఒత్తిడికి అధికారులు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో అడ్డమైన చాకిరీ చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి తట్టుకోలేక ఆశావర్కర్స్ తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సెలవులు లేని కారణంగా ఆశావర్కర్‌కు ఒకరోజు లేదా ఒక గంట పర్మిషన్ కోసం అధికారులు దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి దుస్థితి నెలకొందన్నారు. సచివాలయాలు, ఉప కేంద్రాలలో రోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోబెట్టడం ఆపాలని, రిజిష్టర్‌లో రోజూ సంతకాలు చేయటం ఆపాలని, పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లెప్రసీ సర్వేకు చెల్లించాల్సిన పరితోషికాలు మూడేళ్లుగా బకాయిలున్నా అధికారులు పట్టించుకోలేదని చెప్పారు. ఆశా కార్యకర్తలకు న్యాయం చెయ్యకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ రమేష్ బాబు కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయుకులు రామామణి, మల్లేశ్వరి, నాగరత్న, శ్రావణి, పద్మావతి, లలిత, పుణ్యవతి, గాయత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతీ, బాలకుమారి, జానకి, నిర్మల పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు



డిప్యూటీ డిఎంహెచ్ఒకు వినతి పత్రం అందజేస్తున్న ఆశాలు

ఆదివాసీల తొలి విప్లవ వీరుడు బీర్సా ముండా

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బీర్సా ముండా అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో ఆదివాసీల్లో తొలి విప్లవ వీరుడైన బీర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన జాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ముండా చిత్రపటానికి, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన బీర్సా ముండా జయంతి నవంబర్ 15ను 'జన జాతీయ గౌరవ దివస్' గా జరుపుకోవడం, వారిని స్మరించుకోవడం ఆనందదాయకమన్నారు. ఆదివాసీల్లో విప్లవ భావాలను రగిలించిన తొలి వీరుడని కొనియాడారు. ప్రజలు ఎన్నుకున్న రాజ్యాన్ని స్థాపిద్దాం అనే నినాదాలతో ఆదివాసీలను తిరుగుబాటు వైపు నడిపించాలన్నారు. జార్ఖండ్ ప్రాంతంలో జన్మించిన ఆయన్ను ముండా తెగకు చెందిన ప్రజలు ఆయన 'భగవాన్' అని పిలిచేవారని, ఆదివాసీల సాగుభూములపై విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారిపై పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సంతల్ తదితర తెగలవారు తమ హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను, పథకాలను రూపొందించిందని, వీటిని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకొని మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి సందప్ప మాట్లాడుతూ బీర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌గా భారత కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఈ గుర్తింపు ఆదివాసీలందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలను ఆదివాసి విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ మధు సూదనరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి సందప్ప, రైల్వే కోడూరు జడ్‌పిటిసి రత్నమ్మ, జిల్లాలోని గిరిజన సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

జిల్లాలో ఇసుక కొరత లేదు : కలెక్టర్



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఇసుకకు కొరత లేదని స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లడం జరుగుతోందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఇసుక అంశంపై మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు ఎన్ని, పనిచేస్తున్నవి ఎన్ని, ఇంకను ప్రారంభించాల్సినవి ఎన్ని, రీచ్‌లలో అవసరమైన మేర ఇసుక అందుబాటులో ఉందా, ఇసుక సరఫరా కొరకు ఏజెన్సీల ఎంపిక, ప్రస్తుత ఇసుక రేట్లు, బల్క్ రిజిస్ట్రేషన్, సరఫరా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో నిఘా తదితర అంశాలలో జిల్లాల వారీగా మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్లతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు ఫైనలైజ్ చేయని చోట్ల వెంటనే టెండర్లను పిలిచి ఒక వారంలోగా ఏజెన్సీలను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు ఇసుకను అందిస్తోందని, సరిహద్దు చెక్‌పోస్టులలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మొత్తం ఐదు ఇసుక రీచులు ఉన్నాయని తెలిపారు. ఇందులో మూడు ఇసుక రీచ్‌లు పని చేస్తున్నాయని చెప్పారు. అందులో అవసరమైన మేర ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. వీరబల్లి మండలం మట్లిలో త్వరలో ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తామన్నారు. స్థానికంగా చిన్న చిన్న సమస్యలతో రీచ్‌లుప్రారంభం కాలేదని, స్థానికులతో మాట్లాడి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జసి ఆదర్శ్ రాజేంద్రన్, మైనింగ్ శాఖ ఏడీ అధికారులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎం.విజయమ్మ, ఎస్.అమరావతి సిడిఎఒ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి రమేష్‌కు ఐసిడిఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ మినీ అంగన్వాడీ వర్కర్లు రాష్ట్రంలోని పేద బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. మినీ వర్కర్లు వర్కర్ పనితో పాటు హెల్పర్ పని కూడా చేయడంతో పని భారం పెరిగిందని తెలిపారు. మినీ వర్కర్లకు ప్రమోషన్‌లు ఇవ్వాలని జిఒ ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, అత్యవసర సమాయాలలోనూ, వేసవిలోనూ అంగన్వాడి వర్కర్లకు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె కారణంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చేందుకు అంగీకరించారని అన్నారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన సర్వే కూడా ముగిసిందని మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని, ఇతర అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.



వినతి పత్రం అందిస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

బయోమెట్రిక్ ద్వారా జీతాల చెల్లింపు బాధాకరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సచివాలయం ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతాలు చెల్లించాలని ఆదేశించడం దారుణమని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతాలు చెల్లించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారని, దీని వల్ల సచివాలయం ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నెట్ వర్క్ సమస్య వలన సమయానికి బయోమెట్రిక్ హాజరు వేయలేమని, కొన్నిసార్లు యాప్స్ సైతం పనిచేయవని తెలిపారు. ఇలాంటి సమయంలో బయోమెట్రిక్ వేయలేమని అలాంటపుడు ఉద్యోగులకు జీతాల్లో కోత విధించడం జరుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేని ఈ విధానాన్ని సచివాలయం ఉద్యోగులకు మాత్రమే పెట్టడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ విధానాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఉద్యోగుల తరఫున డిమాండ్ చేశారు. సచివాల యం ఉద్యోగులకు ఇంతవరకు జాబ్ చార్ట్ ప్రకటించలేదని, వెంటనే జాబ్ చార్ట్ ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సచివాలయం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన

ప్రజాశక్తి-పీలేరు: ఉచిత న్యాయ సేవలు క్షేత్రస్థాయిలో కక్షిదారులకు ఉపయోగపడేలా కృషి చేసేందుకు ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, చిత్తూరు జిల్లా కోర్టు ఆదేశాల మేరకు పీలేరు సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జి కె. రవి ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పీలేరు

108 ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీలేరు మండల తహశీల్దార్ భీమేశ్వరరావుకు యూనియన్ తరపున వినతిపత్రం సమర్పించారు. 108 ఉద్యోగుల యూనియన్ నాయకులు శుక్రవారం స్థానిక తహశీల్దారును కలసి తమ సమస్యలను వినతిపత్రం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలపై వెంటనే ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 25 నుంచి తాము సమ్మెలోకి వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పైలట్ రహంతుల్లా, బివి చలపతి, శ్రీనివాసులు, రవి, వెంకటరమణ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గురు అరవింద్

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి :జడ్జి


ప్రజాశక్తి-వాల్మీకిపురం

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు, బ్యాంక్ అధికారులు కృషి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసులు, బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఇరువర్గాలను రాజీ అయ్యేవిధంగా అవగాహనలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, బ్యాంక్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్‌పిగా వెంకటాద్రి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్)గా ఎం. వెంకటాద్రి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీలో భాగంగా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో పని చేసన్న ఆయనను జిల్లా ఎఎస్‌పిగా నియమించింది. అదనపు ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్‌పి వి. విద్యాసాగర్ నాయుడును జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందించారు. జిల్లా పోలీసు కార్యాలయ పని తీరును పర్యవేక్షించాలని, రాష్ట్ర డిజిపి కార్యాలయం, రేంజ్ పోలీసు కార్యాలయాలతో జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఎటువంటి కాలయాపన లేకుండా జరిగే విధంగా చూడాలని అన్నారు. జిల్లాలో శాంతి భద్రతలు మెరుగుపరిచే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై, క్రమశిక్షణ, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించడం, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, డిజిపి, కర్నూల్ రేంజ్ డిఐజి, ఎస్‌పికి తెలిపారు. నిజాయితీగా సమర్థవంతంగా పనిచేసే జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు సంపాదిస్తామని తెలిపారు. ఆయనకు పలువురు పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ సిబ్బంది, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్‌పికి పూలమొక్కను అందిస్తున్న వెంకటాద్రి

ఎస్‌పిని కలిసిన వై.ఎస్.సునీత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్




తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సుదీర్ఘంగా న్యాయం కోసం పోరాడుతున్న డాక్టర్ సునీత జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడును శుక్రవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఆయన కు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వివేకా హత్య కేసు గురించి ఎస్‌పికి వివరించారు. వివేకా హంతకులకు శిక్షపడేలా పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డి అభ్యంతకర పోస్టులపైనా ఆమె ఎస్‌పితో చర్చించారు. అనంతరం కడప నుంచి హైదరాబాద్‌కు బయలు దేరారు. దీనిపై ఎస్‌పిని సంప్రదించగా వాస్తవమేనని, మర్యాదపూర్వకంగా కలిశారని పేర్కొనడం గమనార్హం. ఇదీలా ఉండగా గతంలో ఎస్‌పిగా ఉన్న హర్షవర్ధన్‌రాజును కూడా ఆగస్టులో వైఎస్ సునీత కలిశారు. అప్పట్లోనే విజయవాడలో హోంమంత్రి అనితను కలిసి వివేకా హంతలకుకు స్థానిక పోలీసుల అండ ఉందని సునీత ఆవేదన వెలి బుచ్చారు. సిబిఐ విచారణకు పోలీసులు సహకరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-వీరబల్లి

పంచాయతీ నిధుల దుర్వినియోగం చేస్తూ పనులు చేయకుండా స్వాహా పాల్పడ్డారని పలువురు సానిపాయి పంచాయతీ సర్పంచ్ నేతి ఆంజనేయులుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు డిఎల్‌పిఒ మస్తాన్‌వలి శుక్రవారం గ్రామ సచివాలయంలో ఇరువురి సమక్షంలో విచారణ చేపట్టారు. విచారణలో గ్రావెల్ పనులు ఎక్కడ చేపట్టకుండానే చేపట్టినట్లు చూపి రూ.20 లక్షలు వరకు డ్రా చేయడం జరిగిందని ఫిర్యాదు దారులు రామ్మోహన్, రమేష్ పేర్కొన్నారు. బ్లీచింగ్ చల్లకుండా ట్యాంక్ క్లీనింగ్ ఎక్కడ చేపట్టకుండా చేపట్టినట్లు చూపి నిధులు డ్రా చేశారన్నారు. చాలా పనులకు సంబంధించి రికార్డులు లేవని చూపించాలని డిఎల్‌పిఒను అడగారు. వారి మేరకు ఆయన ఉన్న మేరకు రికార్డులు చూపించారు. పనులు క్షేత్రస్థాయికి వస్తే అర్థమవుతుందని తెలపడంతో తమకు కేవలం విచారించామని చెప్పారని చేస్తున్నామని డిఎల్‌పిఒ చెప్పినట్లు చెప్పారు. అనంతరం పరిశీలించి ఆయన వెళ్లిపోయారు. సర్పంచ్ నేతి ఆంజనేయులు మాట్లాడుతూ తాను చేసిన పనులకు అన్ని రికార్డులు ఉన్నాయని పనులు చేయకుండా ఎటువంటి నిధులు దుర్వినియోగం కాలేదని తమపై కక్షకట్టి ఇలా విచారణలు చేయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఎస్ఐ మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ మస్తాన్‌వలి

పీలేరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా బాలిరెడ్డి

ప్రజాశక్తి-కలికిరి



పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జిగా బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మరొకసారి నియమితులయ్యారు. పిసిసి అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను శుక్రవారం ప్రకటించింది. అందులో భాగంగా పీలేరు నియోజకవర్గం బాధ్యతలు సోమశేఖర్‌రెడ్డికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటానికి ప్రతి ఫలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి దక్కిందని బాలిరెడ్డి పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని తెలిపారు. తనకు ఇన్‌ఛార్జి పదవి దక్కడంలో సహకరించిన పిసిసి అధ్యక్షులు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని కలికిరి మేజర్ పంచాయతీ ఇఒ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో సచివాలయ సిబ్బందితో పర్యటించి మెరుగైన పారిశుధ్యం కొరకు తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఇంద్రమ్మ కాలనీలోని మురుగునీటి కాలువలను పరిశీలించి కాదోలను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అంటు రోగాలు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఫ్రైడే ఫ్రైడే గా పాటించాలని, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల టిడిపి మైనారిటీ ఉపాధ్యక్షుడు వైజాగ్‌బాషా, బూతు కన్వీనర్ వెంకట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆలయం వద్ద ఉదయం దైవ ఉపన్యాసాలు, సాయంత్రం లక్ష దీపారాధన కార్యక్రమాన్ని ఆలయ నిర్వహకులు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గార్గేయ శిఖరంపై బంగి కృష్ణప్ప చేత జ్యోతి ప్రజ్వలన చేయించారు. రాత్రి 8 గంటలకు శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి కావటంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు.ఆలయం వద్ద ఉదయం నుండి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.**రాజంపేట అర్బన్ :** మండల వ్యాప్తంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున పోటెత్తడంతో ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు విశేషించి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. డిఎస్‌పి సుధాకర్ ఆధ్వర్యంలో మండలంలోని శైవ క్షేత్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని గుర్తుంచుకొని ఈ ఏడాది హత్యరాల శ్రీ కామాక్షి సమేత త్రితేశ్వర స్వామి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేశారు.**రామాపురం :**కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని వేకువ జాము నుంచే శివాలయాలతో పాటు వివధ ఆలయాలలో దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని హసనాపురం పరిధిలో వెలసిన శ్రీ గంగా భవాని సమేత మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు నటరాజ స్వామి అద్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **తంబళ్లపల్లి :** కార్తీక పౌర్ణమి సందర్భంగా తంబళ్లపల్లె మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఉదయాన్నే మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థప్రదాయాలను భక్తులకు అందజేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. మల్లయ్యకొండకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఇఒ మునిరాజు, సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలుకల్పించారు. **వీరబల్లి :** కార్తిక పౌర్ణమి వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా కనుల పండువగా జరిగాయి. మండలంలోని సాయిబాబా గుడిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా తంగెళ్ల వెంకటయ్య కుమారులు రామ్మోహన్, లక్ష్మీ శేఖర్, కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా సాయిబాబా గుడిలో స్వామివారికి అభిషేకము, సత్యనారాయణ స్వామి వ్రతము, ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై స్వామి వారి పూజలు అందుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట కూతుపు రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేంద్ర రెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగ మల్లిరెడ్డి, మల్లేశ్వర్ నగేశ్వర్, గోపాలరెడ్డి భక్తులు పాల్గొన్నారు. **కలకడ:** కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించుకున్నారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని స్థానిక దేవళంపేటలో వెలసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం, గోపాలపురంలో వెలసిన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయం, బాటవారిపల్లె సమీపంలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం విశేషం. శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి శివపార్వతులను ప్రత్యేకంగా పుష్ప పల్లకిలో అలంకరించి స్థానిక జరిగెద్ద నుండి జరి మహోత్సవంగా జరిగే ప్రాంతం వరకు ఊరేగించి లక్ష్మీపార్వతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు త్రికోటం విజయ సారథి, తిప్పారెడ్డి, సుబ్బరామయ్య ,గురునాథ్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను గుర్తించండి

ప్రజాశక్తి - నందలూరు

మండలంలో అభివృద్ధి పనులను గుర్తించాలని ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సచివాలయాల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు తమ విధులను ఏ విధంగా నిర్వహించాలో, క్వాలిటీ చెక్ ఏ విధంగా చేయాలో వర్క్ ఆర్డర్ శాంక్షన్ ఏ విధంగా చేయాలో అనే దానిపై అవగాహన కల్పించారు. పంచాయతీల వారీగా అభివృద్ధి పనులు ఎక్కడ అవసరం ఉందో గుర్తించాలన్నారు. మండల ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వచ్చి మండల అభివృద్ధి నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని విధి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుజాతమ్మ, పంచాయతీరాజ్ ఎఇ గంగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వెంకటరమణ, అధికారులు, పాల్గొన్నారు.

ఈ రహదారికి గ్రహణం వీడేదెన్నడో?

ప్రజాశక్తి-పుల్లంపేట

మాది పేదల ప్రభుత్వం, సంక్షేమమే మా ధ్యేయం, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తామంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టడం తప్ప నిజంగా అలాంటి సమస్యలు ఎదురైతే ఆ సమస్యను పరిష్కరించే సత్తా ఏ ప్రభుత్వానికి లేదని అంటున్నారు మండలంలోని రెడ్డిపల్లి అరుంధతివాడ ప్రజలు. అరుంధతి వాడలో ప్రధాన రహదారి వర్షం వచ్చిదంటే చాలు బురదమయంగా నడవ డానికి వీలులేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహన దారులు ప్రమాదాలకు గురై గాయ పడుతున్నారని అన్నారు. ఈ దారిలో చిన్నారులు, వృద్ధులు వెళ్ళాలంటే ఎక్కడ కాలుజారి పడి గాయపడతారోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి అత్యంత దారుణంగా తయారై ఇక్కడి ప్రజలకు నరకం చూపిస్తోందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రహదారిని నిర్మిస్తామని అప్పటి నాయకులు చెప్పడమే తప్ప చేసింది ఏమీ లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. వైసిపిలో హయాంలో లభించని మోక్షం కూటమి ప్రభుత్వంలో అయినా లభిస్తుందా అంటే ఇటువైపు కన్నెత్తి చూసే నాయకుడు లేరని అన్నారు. ఈ దారిలో ప్రయాణించాలంటే ప్రజలతో పాటు మహిళలు, విద్యార్థులు రోజు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సిసి రోడ్డు ఏర్పాటుకు కృషి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న రెడ్డిపల్లి అరుంధతివాడ రోడ్డు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎమ్మెల్యేపై ఆరోపణలు



మాట్లాడుతున్న జనసేన, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మదనపల్లె అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎమ్మెల్యే షాజహాన్‌బాషాపై కొంతమంది అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని జనసేన పార్టీ మదనపల్లె నియోజకవర్గ సీనియర్ నాయకులు తోట కల్యాణ్, జనసేన మండల అధ్యక్షులు ప్రదీప్ సింగ్, టిడిపి నాయకులు గిరీష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం దిగువపల్లెలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన నాటి నుంచి ఎన్నికల్లో విజయం సాధించ డానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరి దగ్గరకి స్వయంగా వెళ్లి ఆయన గెలుపుకు సహకరించాలని వారిని కోరడం జరిగిందన్నారు. ఆనాడు ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కడాన్ని జీర్ణించుకోలేక ఎన్నికల్లో కొంతమంది ఆయనకు సహకరించకుండా వ్యవహరించారని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం నిరంతరం శ్రమించి మదనపల్లి ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రత్యేక శ్రద్ధతో అభివృద్దే లక్ష్యంగా చేసుకొని శరవేగంగా అభివృద్ధి పనులను చేపడుతున్నారని అన్నారు. మదనపల్లెలో గత 15 సంవత్సరాగా లేని అభివృద్ధిని నేడు ఆయన చేసి చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఐదు నెలల కాలంలోనే ప్రతి పంచాయతీ లోనూ సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలను చేపట్టారని అన్నారు. మదన పల్లె నడిబొడ్డులో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రత్యేక చొరవ తీసుకొని అధికారులతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్చించి, రోడ్డు విస్తరణ పనులను దగ్గరుండి చేపట్టారని పేర్కొన్నారు. ప్రజలు స్వయంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేస్తున్న అభివృద్ధి పనులను స్వాగతిస్తూ, అభినందిస్తుంటే ఆయన అంటే గిట్టని వారు ఆయన చేస్తున్న అభివృద్ధిని చూడలేక, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేక అనవసరమైన ఆరోపణలతో దుష్ప్రచా రాన్ని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పై ఆరోపణలను మానుకోవాలని లేకుంటే ఆరోపణలు చేస్తున్న వారికి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్ర సింగ్, కేశవ, తానేశ్వర్, జయశేఖర్, అశోక్, విషు, కిరణ్, మదన్, నాగేంద్ర, మంజు పాల్గొన్నారు.

సెజ్‌ను సందర్శించిన ఉద్యాన విద్యార్థులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంత రాజుపేట ఉద్యాన కళాశాలలో బిఎస్‌సి ఉద్యాన కోర్సు నాలుగవ సంవత్సర విద్యార్థులు శుక్రవారం నాయుడుపేట సమీపంలోని మేనకూరు సెజ్ సందర్శించారు.గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానంలో శిక్షణ పొందుతున్న 12 మంది విద్యార్థులు పారిశ్రామిక సందర్శన చేశారు.పెట్లూరు నిమ్మ పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ పి.శ్యాం సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇండస్ కాఫీ పరిశ్రమలో కలియ తిరుగుతూ అనేక విషయాలు తెలుసుకున్నారు.ఫ్రీజ్ డ్రైయింగ్ పద్ధతిలో కాఫీ పౌడర్ తయారీని పరిశీలించారు.ఆ సెజ్‌లోని మరికొన్ని పరిశ్రమలు కలియ తిరిగి వివిధ ఉత్పత్తుల తయారీ తెలుసుకున్నారు. ఇండస్ కాఫీ సంస్థ జిఎం మనీష్, హెచ్ ఆర్ రమేష్, సిఎఫ్ఒ పెట్లూరు మహేష్‌లు విద్యార్థులకు అనేక విషయాలు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కాందర్ నాయక్, అనంతరాజు పేట ఉద్యాన కళాశాలకు చెందిన ఎడిఆర్ డాక్టర్ బి.హరి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



సెజ్ లోని ఇండస్ కాఫీని సందర్శిస్తున్న విద్యార్థులు,శాస్త్రవేత్తలు

జ్ఞానానికి పునాదులు గ్రంథాలయాలు : ఎంఇఒ



కలకడ: గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

గ్రంథాలయాలు జ్ఞానానికి పునాదులుగా వెలిశాయని విశ్రాంతి ప్రధానోపాధ్యా యులు రెడ్డప్పరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో రెండవ రోజు 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించిన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే గ్రంథాల యాలకు వెళ్లే అలవాటు ఉన్న వారు భవిష్యత్తులో తెలివితేటలతో రాణిస్తారని పేర్కొన్నారు. గ్రంథాలయాలలో ఉన్న పుస్తకాలను, వార్త పత్రికలను ఉచితంగా పొంది వివిధ రకాలైన పోటీ పరీక్షలకు తయారు కావచ్చని అన్నారు. పుస్తక ప్రదర్శనలతో కథల క్విజ్, దేశ నాయకుల చరిత్ర పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, చిన్నపిల్లల కథల పుస్త కాలు, వంటి పుస్తకాలు ప్రదర్శించడం జరిగిందని గ్రంథాలయ శాఖ అధికారి అమర నాథ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **పీలేరు:** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతతో పాటు, డిఎస్‌సి పరీక్షకు తయారవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం అవసరమైన మెటీరియల్‌ను గ్రంథాలయాల్లో సమకూర్చడం మంచి పరిణామమని పీలేరు మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పీలేరు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ ప్రాంతాలయాల్లో దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు మాస పత్రికలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, నవలలు, ఇతర రచనా పుస్తకాలతో పాటు 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను కూడా విద్యార్థుల కోసం అందు బాటులో ఉంచినట్లు చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజలు గ్రంథాలయ సేవలను సద్విని యోగం చేసుకుని విజ్ఞానం అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి, పద్యకవి జలకనూరి మురళీధర్ రాజు, లైబ్రేరియన్ అమర్‌నాథ్, సిబ్బంది, పాఠకులు, పాల్గొన్నారు. **మదనపల్లి :** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కురబలకోట మండలం నందు ఏర్పాటు చేయబడిన శాఖ గ్రంథాలయంలోపుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కురబలకోట అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.రాధ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, పాఠకులు పద్మావతమ్మ పాల్గొన్నారు.**కలికిరి:**గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కలికిరిలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. గ్రంథాలయ అధికారి నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి శ్రీనివాస కాలేజ్, అక్షర ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రంథాలయంలోని పుస్తకాలను వీక్షించారు.**తంబళ్లపల్లి :** తంబళ్లపల్లి గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు జి వెంకట నారాయణ, విద్యార్థులు మరియు పాఠకులు రమణా,రెడ్డప్ప గ్రంథాలయ అధికారి జిలానిబాషా పాల్గొన్నారు.



బలరాంరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

అధైర్య పడాల్సిన అవసరం లేదు :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి శ్రేణులు ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పోకనాటి వీధిలో నివాసం ఉంటున్న కంచి కోదండ, కంచి బలరాంరెడ్డి నివాసానికి ఆయన విచ్చేశారు. భాగంగా కంచి బలరాం రెడ్డి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసిందని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతీకార పాలనకు శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గంలోని వైసిపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని వారికి అండగా నిలబడతానని ఆయన స్పష్టం చేశారు. 2027లో జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్రం చెబుతోందని, అదే గనుక జరిగితే కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో రెడ్డిశేఖర్‌రెడ్డి, కంచి కళ్యాణ్, కుమార్‌రెడ్డి, వంక నారాయణ, కేశవరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బాబురెడ్డి, రఫీ, సీకుర్తి శంకర్ రెడ్డి, ఎస్.ఎస్.ఫయాజ్, పాగొండ రఫీ, పవన్, సబ్జీ, మేడా రాఘవ పాల్గొన్నారు.


అరుణాచలంకు తరలిన ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-పీలేరు

కార్తీక మాసం పౌర్ణమిని పురష్కరించుకుని పీలేరు డిపో నుంచి అరుణాచలంకు నాలుగు ప్రత్యేక బస్సులు పంపినట్లు డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. శుక్రవారం ఆ ప్రత్యేక బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ భక్తులు, ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలైకు కూడా అద్దె ప్రాతిపదికన బస్సులు పంపిస్తామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

వెంకన్నకు వెండి ఆభరణం బహూకరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



వెండి ఆభరణాన్ని అందిస్తున్న దాతలు

మండలంలోని కోసువారిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శుక్రవారం రోజు కార్తీక పౌర్ణమి విశేష సందర్భంగా అభిషేక అర్చన కార్యక్రమం జరిగాయి. మదనపల్లికు చెందిన దాత హరి నాథ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు స్వామివారికి వెండియ జ్ఞోపవీతము (జంధ్యం)ను ఆలయ అర్చక రమేష్‌బాబుకు అందించారు. అర్చకులు దానిని స్వామి శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి వారికి అలంకరించి , విశేషముగా అర్చనాది సమర్పణ కైంకర్యములను నిర్వహించారు.



పైలాన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రూపానందరెడ్డి

నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం :'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట నిర్వాసిత బాధితులకు సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నమయ్య అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట ఆర్ఆర్ లేఅవుట్ 5లో పైలాన్ నిర్మాణా నికి భూమిపూజ చేశారు. నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ లలో అన్ని సౌకర్యాలను వెంటనే పూర్తి చేసి అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ తోడ్పాటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో సిపిఒ సుదర్శన్‌రెడ్డి, పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, తళ్లెం రమణారెడ్డి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఇఒ

నోట్ పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువు మిట్ట వద్ద గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో చిన్నారులకు శుక్రవారం నోటు పుస్తకాలను వితరణగా అందజేశారు. హైదరాబాదులోని ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ శ్రీవాసు సాయిరాం వారు సూర్యచంద్ర చారిటబుల్ ట్రస్ట్ తరపున వెలుగు ప్రత్యేక పాఠశాల దివ్యాంగులకు 600 నోట్ బుక్స్ ఇచ్చారు. ఈ నోటు పుస్తకాలను ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతులతకు అందించారు. ఇంతటి విలువ గల నోట్ బుక్స్ అందించినందుకు వెలుగు సిబ్బంది, పిల్లలు వాసుసా యిరాంకు ధన్యవాదాలు తెలిపారు. వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్‌రెడ్డి, ఎంఇఒ ప్రభాకర్ రెడ్డికి మెమొంటోని అందజేసి, శాలువాతో సత్కరించారు. వెలుగు వృద్ధాశ్రమంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీనా కుమారి, సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది, వృద్దులు, పిల్లలు పాల్గొన్నారు.


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణం, సదుం రోడ్డులోని శ్రీ లక్ష్మి వృద్ధాశ్రమంలో ఉన్న దాదాపు 15మందికిపైగా వద్దులకు మానవత స్వచ్ఛంద సంస్థ, పీలేరు వారి ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ చైర్మన్ వంగిమళ్ల రామచంద్ర మాట్లాడుతూ జీవిత చరమాంకంలోని వద్దులకు అవసరమైన వసతి, వైద్యం అందిస్తూ శ్రద్ధగా వద్దులను రక్షిస్తున్న ఆశ్రమ నిర్వాహకులను తప్పక అభినందించాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టి సుబ్రహ్మణ్యం, సురేష్ కుమార్, సంస్థ ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్, కో కన్వీనర్ వై.వి.రమణ, కో-చైర్మన్ రాచపల్లె కష్టమూర్తి, సభ్యులు పోతంశెట్టి రమేష్, పోతం శెట్టి సుధాకర్ బాబు, యర్రంశెట్టి రామకష్ణ పాల్గొన్నారు.

వన్ టౌన్ సిఐగా ఎరిషావలి

ప్రజాశక్తి-మదనపల్లె



మదనపల్లె వన్‌టౌన్ సిఐగా ఎరిషావలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ చాంద్‌బాషా బదిలీపై రాయచోటి పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు వెళ్లారు. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కుమార్ ఇటీవల సిఐల బదిలీలు, నియామక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎరిషావలి గతంలో రెండో పట్టణ ఎస్ఐగా పనిచేసిన అనుభవంతో సేవలు అందిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల ను అరికట్టి బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రజలకు సేవలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు ను కలిసినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-కలకడ



మాట్లాడుతున్నవిజయ్ కుమారి

రోడ్డు భద్రతా నియమాలు పాటించుకుంటే చర్యలు తప్పవని పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమారి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడలో ఆమె వాహనాల తనిఖీలలో భాగంగా పలు వాహనాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో చిన్న పిల్లలు ఎవరైనా వాహనాలు నడిపిన యెడల వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి వాహనదారానికి డ్రైవింగ్ లైసెన్స్ లు హెల్మెట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా వాహనాలకు ఇన్స్యూరెన్స్, ఆర్‌సి, తప్పక ఉండాలని గుర్తు చేశారు. ఆటోలలో అధిక లోడు వేసుకుని ప్రయాణించరాదని ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు యూనిఫామ్ కలిగి ఉండాలని తెలిపారు. చిన్న ఆటోలలో ముగ్గురు కన్నా ఎక్కువ మందిని వేసుకొని ప్రయాణం చేయరాదని అలా చేసిన వారికి అపరాధ రుసుంతో పాటు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు.

విధేయతకు పట్టం

-'అద్దేపల్లి'కి రాష్ట్ర డైరెక్టర్ పదవి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



అద్దేపల్లి ప్రతాప్‌రాజు

ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన అద్దేపల్లి ప్రతాప్‌రాజుకు క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదవి వరించింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో రెండుసార్లు రాజంపేట నియోజక వర్గానికి అవకాశం దక్కకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్న రాజంపేట ప్రజలు అద్దేపల్లికి ప్రకటించిన రాష్ట్ర డైరెక్టర్ పదవితో ఆనందో త్సాహాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరాడంబరతతో నిజా యితీకి మారు రూపులా ఉంటూ తన చెంతకు వెళ్లే ప్రజలకు తానున్నానంటూ భరోసా కల్పిస్తూ విధేయుడిగా పేరు తెచ్చుకున్న అద్దేపల్లి ప్రతాప్ రాజును రాష్ట్ర డైరెక్టర్ పదవితో సముచితంగా గౌరవించడం హర్షనీయమని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.